కన్సల్టెంట్ పబ్లిక్ హెల్త్ పోస్టు భర్తీకి చర్యలు

ప్రజాశక్తి - బెలగాం

జిల్లాలో కన్సల్టెంట్ పబ్లిక్ హెల్త్ పోస్టను కాంట్రాక్ట్ కమ్ ఔట్సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథం రావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్య, ఆరోగ్యశాఖలో కన్సల్టెంట్ పబ్లిక్ హెల్త్ పోస్ట్ భర్తీ చేసేందుకు ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులను https://parvathipurammanyam.ap.gov.in వెబ్ సైట్ నుండి డౌన్లోడ్ చేసి, ఈనెల 21 నుంచి 28లోగా తమ కార్యాలయానికి అన్ని ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు జత చేసి అందజేయాలన్నారు. ఈ నియామకానికి సంబంధించి ఖాళీలు, అర్హత నిబంధనల్లో మార్పులు, చేర్పులు చేసేందుకు, లేదా ఎటువంటి కారణాలు చూపకుండానే రద్దు చేసేందుకు, ఇతర నిర్ణయాలు తీసుకొనేందుకు ఎంపిక కమిటీకి పూర్తి అధికారం ఉందని అన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఉప ఎన్నిక

ప్రజాశక్తి - కురుపాం

జిల్లాలోని ఒక పంచాయతీకి, ఒక వార్డు సభ్యునికి శనివారం జరిగిన ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. కురుపాం మండలంలో గుమ్మ సర్పంచ్ స్థానానికి శనివారం జరిగిన ఉపఎన్నిక ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంతంగా ముగిసింది. వైసిపి బలపర్చిన అభ్యర్థి ఆరిక గోపాలరావు 54 ఓట్లు మెజార్టీతో గెలిపొందినట్లు ఎన్నికల అధికారి ఎ.సాంబమూర్తి తెలిపారు. ఆయన అందించిన వివరాలు ప్రకారం గ్రామంలో 1202 ఓట్లు గాను 937 ఓట్లు పోలవ్వగా, వైసిపి బలపర్చిన అభ్యర్థి ఆరిక గోపాలరావుకు 366 ఓట్లు రాగా, టిడిపి బలపరిచిన అభ్యర్థి కొండగొర్రె వెంకటరావుకు 312 ఓట్లు, టిడిపి రెబల్ అభ్యర్థి తోట పట్టయ్యకు 157 ఓట్లు, లిమ్మక భానుప్రసాద్‌కి 79 ఓట్లు, 19 ఓట్లు చెల్లనివిగా, 4 ఓట్లు నోటాకు పడినట్లు తెలిపారు.

ఏకగ్రీవమైన నాలుగో వార్డు

పార్వతీపురంరూరల్ : మండలంలోని రావికోన పంచాయతీలో నాలుగో వార్డు స్థానానికి ఏర్పడిన ఖాళీలో జరిగిన ఉప ఎన్నికలో డి.జానకమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్వో బసవరాజు ప్రకటించారు. ఈ మేరకు ఆమెకు శనివారం నియామక ధ్రువపత్రాన్ని అధికారులు అందజేశారు.

బొబ్బిలిరూరల్.. మండలంలోని కొండదేవుపల్లిలో రెండో వార్డులో టిడిపి బలపర్చిన అభ్యర్థి పూతి సత్యనారాయణ.. వైసిపి మద్దతిచ్చిన రంభ లక్ష్మిపై 26 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికల పరిశీలకులుగా ఎంపిడిఒ రవికుమార్, రూట్ ఆఫీసర్‌గా శ్రవణ్ కుమార్ వ్యవహరించారు. సిఐ నాగేశ్వరరావు ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటుచేశారు.

డెంకాడ.. మండలంలోని డి.తాళ్లవలస గ్రామంలో ఏడో వార్డు ఉప ఎన్నికల్లో వైసిపి బలపరిచిన అప్పల సత్యవతికి 105 ఓట్లు, టిడిపి మద్దతు అభ్యర్థికి 17 ఓట్లు వచ్చాయి. 88 ఓట్ల తేడాతో సత్యవతి విజయం సాధించారు.

బొండపల్లి.. మండలంలోని దేవుపల్లిలో 13వ వార్డు సభ్యులుగా టిడిపి మద్దతిచ్చిన గాదం రాజేంద్ర కుమార్ విజయం సాదించారు. రాజేంద్రకు 106 ఓట్లు రాగా, మలిరెడ్డి శ్యామలరావుకు 86 ఓట్లు వచ్చాయి. సిఐ లెంక నారాయణరావు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

జామి.. మండలంలోని లొట్లపల్లిలో పదో వార్డు ఉప ఎన్నికలో వైసిపి బలపరిచిన గంగమ్మ.. ప్రత్యర్థి చందక గౌరిపై 10 ఓట్ల తేడాతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి గంగరాజు ప్రకటించారు.

బాడంగి.. మండలంలోని పాల్తేరులో ఆరో వార్డు ఉప ఎన్నికలో వైసిపి మద్దతుదారు పూడి సత్యవతి.. ప్రత్యర్థిపై 76 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

గుమ్మ సర్పంచ్‌గా గోపాలరావు గెలుపు

గోపాలరావుకు నియామక ధ్రువపత్రం అందజేస్తున్న అధికారులు

కొప్పెర్లలో వైసిపి రెబల్ అభ్యర్థి విజయం

పూసపాటిరేగ.. మండలంలోని కొప్పెర్ల సర్పంచ్‌గా వైసిపి రెబల్ అభ్యర్థి సంకాబత్తుల సత్తిబాబు 88 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వైసిపి, టిడిపి ఉమ్మడిగా బలపరిచిన అభ్యర్థి పైడి పార్వతమ్మ ఓటమిపాలయ్యారు. సత్తిబాబుకు ఎంపిడిఒ జి.రామారావు, ఎన్నికల ఆర్ఒ పాపునాయుడు ధ్రువపత్రం అందజేశారు. తనది ప్రజా విజయమని సర్పంచ్ సత్తిబాబు తెలిపారు. గ్రామంలో టిడిపి, వైసిపి, జనసేన కలిసి తనను ఓడించాలని ప్రయత్నించారని, ఓటర్లను బెదిరించారని, అందుకే ప్రజలు తిరగబడ్డారని చెప్పారు.

వంగరలో టిడిపి... ఓని అగ్రహారంలో వైసిపి..

వంగర.. మండలంలో లక్ష్మింపేట, ఓని అగ్రహారం సర్పంచ్ స్థానాలకు, రుషింగిలో వార్డు మెంబర్‌కు జరిగిన ఉపఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. లక్ష్మింపేటలో వైసిపి బలపరిచిన అభ్యర్థి వాన లక్ష్మీనారాయణపై టిడిపి మద్దతు అభ్యర్థి ఆవు సుజాత 67 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఓని అగ్రహారంలో టిడిపి బలపరిచిన అభ్యర్థి మజ్జి గౌరీశ్వరిపై వైసిపి మద్దతు అభ్యర్థి కాబోతుల రుక్మిణమ్మ 301 ఓట్లు మెజారిటీతో గెలుపొందారు. రుషింగిలో వార్డు స్థానానికి జనసేన బలపరిచిన అభ్యర్థి యలకల శ్రీనివాసరావుపై వైసిపి మద్దతుదారు యలకల రాము 36 ఓట్లు మెజారిటీతో గెలుపొందారు. లక్ష్మింపేటలో టిడిపి విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం మరింత పెరిగింది.

పడాలపేట సర్పంచ్‌గా శ్రీదేవి

విజయనగరంటౌన్ విజయనగరం మండలం పడాలపేట పంచాయతీ సర్పంచ్‌గా వైసిపి మద్దతుదారు సువ్వాడ శ్రీదేవి విజయం సాధించారు. శ్రీదేవికి 736 ఓట్లు రాగా, టిడిపి మద్దతుదారు సుంకర రామలక్ష్మికి 284 ఓట్లు పోలయ్యాయి. కొండకరకాంలో తొమ్మిదో వార్డు సభ్యులుగా వైసిపి బలపరిచిన తుమ్మగంటి మంగ విజయం సాధించారు.

పెంటశ్రీరాంపురం సర్పంచ్‌గా గౌతమి

గంట్యాడ .. మండలంలోని పెంటశ్రీరాంపురం పంచాయతీ ఉప ఎన్నికల్లో వైసిపి మద్దతుదారు కరక గౌతమి.. టిడిపి బలపరిచిన కరక రామయ్యమ్మపై 146 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రెండో వార్డు స్థానానికి జరిగిన ఎన్నికలో వైసిపి మద్దతుదారు గేదెల విజయ గెలుపొందారు.



సీతామహాలక్ష్మిని అభినందిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఎన్నిక ఏదైనా గెలుపు వైసిపిదే : రాజన్నదొర

సాలూరు/పాచిపెంట : ఎన్నిక ఏదైనా గెలుపు వైసిపిదేనని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. పాచిపెంట మండలం పణుకువలస పంచాయతీ పరిధిలో ఒక వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో 85శాతం ఓట్లతో విజయం సాధించిన రెయ్యి సీతామాలక్ష్మిని ఆయన అభినందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపిపై ప్రజల్లో ఆదరణ చెక్కు చెదరలేదడానికి పంచాయతీ ఎన్నికలే నిదర్శనమన్నారు. పంచాయితీలో వార్డు మెంబర్ మరణించడంతో ఇక్కడ ఎన్నిక జరిగిందని, మానవతా దక్పథంతో మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులకి ఏకగ్రీవంగా వదిలేయాల్సి వుండగా టిడిపి పోటీ పెట్టిందని చెప్పారు. మొత్తం 153ఓట్లకు గాను వైసిపి అభ్యర్థి సీతామాలక్ష్మికి 130ఓట్లు పొలయ్యాయనీ చెప్పారు. గత ఎన్నికల ఫలితాలే రానున్న ఎన్నికల్లో పునరావృతమవుతాయనడానికి ఈ ఎన్నికలు తార్కాణమని రాజన్నదొర చెప్పారు.

మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

ఫ్యాప్టో ఆధ్వర్యంలో మోకాళ్లపై నిరసన

ప్రజాశక్తి -కలెక్టరేట్

ఫ్యాప్టో జిల్లాశాఖ ఆధ్వర్యాన శనివారం స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు 3నెలలు జీతాలు చెల్లించాలని, పని సర్దుబాటును రద్దు చేయాలని, జిఒ117 ను రద్దు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని ఉపాధ్యాయులు మోకాళ్లపై నిల్చొని నిరసన చేపట్టారు. ఈ నిరసననుద్దేశించి హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్‌శ్రీనివాసరావు మాట్లాడుతూ బదిలీలు జూన్‌లో జరిగాయని, అప్పటి నుంచి ఉపాధ్యాయులకు 3 నెలల నుండి జీతాలు చెల్లించక పోవడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ రావు మాట్లాడుతూ పని సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను వేధిస్తున్నారని, మానసికంగా హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరిగ్గా బోధన జరగకుండా ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల బాలకృష్ణ మాట్లాడుతూ విద్యారంగాన్ని నాశనం చేస్తున్న జీవో 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. శాప్ నాయకులు గోవిందరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చి సిపిఎస్ రద్దు చేసే ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్, ఎపిటిఎఫ్ నాయకులు ఆర్. అప్పలనాయుడు, ఎం. శివు నాయుడు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10.3 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - పాచిపెంట

అక్రమంగా తరలిస్తున్న 10కేజీల 300గ్రాముల గంజాయిని ఇద్దరు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఫక్రుద్దీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాచిపెంట పోలీసు స్టేషన్ పరిధిలో గల పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద శనివారం జైపూర్ నుంచి విశాఖపట్నంకు అక్రమంగా ఒడిశా ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన షేక్ ముస్లిం(33), ఇక్బాల్ కబీర్ (32) అనే ఇద్దరు వ్యక్తులను చెక్ పోస్టులోని పోలీసుల సహకారంతో అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి సుమారు రూ.26వేలు విలువైన గంజాయిని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశామన్నారు. వీరు ఇద్దరూ జైపూర్ నుంచి ఒడిశా ఆర్టిసి బస్ ద్వారా విజయనగరం అక్కడి నుంచి రైలు ద్వారా కోల్‌కతా తరలించి ముర్షిదాబాద్ ప్రాంతంలో విడిగా అమ్మకాలు జరపడానికి వెళ్తున్నట్టు తెలిసింది. సాలూరు రూరల్ సిఐ ధనుంజయరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను బొబ్బిలి మేజిస్ట్రేట్ వారి వద్ద రిమాండ్ నిమిత్తం తరలించినట్టు తెలిపారు.



చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలుపుతున్న వంతెన సాధన కమిటీ సభ్యులు

చెవిలో పువ్వులు పెట్టుకుని రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం కోసం మూడో రోజు చెవిలో పువ్వులు పెట్టుకొని రిలే నిరాహారదీక్ష కార్యక్రమం చేపట్టారు. వంతెన పూర్తి చేయాలను కోరుతూ కోమట్లపేట వద్ద వంతెన సాధన కమిటీ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేస్తున్నారు. మండలంలో 31 పంచాయతీలకు సంబంధించి అందులో 9 పంచాయతీలకు అతిముఖ్యమైన వంతెన దేవుకోన పంచాయతీ పూర్ణపాడు-లాబేసు వంతెన పెండింగ్ పనులు పూర్తిచేసి గిరిజనుల ప్రాణాలు కాపాడాలని సాధన కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. 2006లో శంకుస్థాపన చేసినా నేటికీ వంతెన పూర్తి చేయకపోవడం పాలకుల చేతకానితనానికి నిదర్శమన్నారు. గిరిజనులు నాగవళి నదిపై ప్రమాదకర ప్రయాణాలు చేస్తున్నా కనీసం అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగున్నర ఏళ్లయినా కనీసం ఒక సిమెంట్ బస్తా పని కూడా చేయకపోవడం దురదృష్టకరమన్నారు. వంతెన నిర్మాణానికి నిధులు పెంచామని ఆర్భాట ప్రచారాల తప్ప పని మాత్రం జరగలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించి వంతెన పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. లేకపోతే నిరసన దీక్షను మరింత ఉధృతి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు శ్రీనివాసరావు నూకరాజు తదితరులున్నారు.

పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలని, పూర్తయిన ప్రాధాన్యత భవనాలను వెంటనే అప్పగించాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ మండల ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యత భవనాలు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనుల నిర్మాణ పరిస్థితులపై సాలూరు, పాచిపెంట మండలాల ఇంజనీర్లతో సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తయిన భవనాల్లో జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు పూర్తయిన భవనాలను పది రోజుల్లో అప్పగించాలని ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులన్నింటినీ పూర్తి చేయాలని, పనులు ప్రారంభం కాని చోట్ల వెంటనే మొదలు పెట్టాలని అన్నారు. పూర్తయిన పనులకు వెంటనే బిల్లులు అప్లోడ్ చేయాలని తెలిపారు. పనులు పూర్తి చేసి బిల్లులు సమర్పించిన వారికి సకాలంలో పేమెంట్లు జరుగుతున్నాయని, కావున సకాలం లో పనులు పూర్తి చేసి బిల్లులు పొందాలని సూచించారు. సమావేశంలో మండల ఇంజనీరింగ్ అధికారులు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీర్లు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

- సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి
- మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - మక్కువ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సిపిఎం సభ్యులు, సానుభూతిపరులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృష్ణమూర్తి మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. జిఎస్‌టి పేరిట ప్రజలపై విపరీతమైన భారాలు వేస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచిందని, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లభించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ పెట్టుబడిదారులైన అదానీ, అంబానీలకు అప్పజెప్పడానికి నల్ల చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కారుచౌకగా కార్పొరేట్లకు అమ్మేస్తున్నారని విమర్శించారు. ఇందులో భాగంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు చూస్తుందన్నారు. విద్య, వైద్యాన్ని ప్రైవేట్‌పరం చేయడానికి కుట్రపన్నుతున్నారన్నారు. బిజెపి చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఎం మండల నూతన కమిటీ ఎన్నికైంది. మండల కన్వీనర్‌గా తాడంగి ప్రభాకర్, సభ్యులుగా పిట్టల సీతారాం, కొండగొర్రి ఆనంద్, అల్లు ఆదినారాయణ, సొండి గౌరమ్మ, దాడి సింహాచలంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగు నాయుడు, వి.ఇందిర పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

చెరువును తలపిస్తున్న ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణ

ఇది చెరువు కాదు....

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మీరు చూస్తున్నది చెరువు అనుకుంటున్నారా... కానేకాదు... పట్టణ నడిబొడ్డున గల ఆర్‌టిసి కాంపెక్స్... శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రాంతమంతా వరద నీటితో నిండిపోయి చెరువును తలపించింది. రాత్రి వేళలో దూర ప్రాంతం నుంచి బస్సులో వచ్చిన ప్రయాణికులు బస్సు దిగి కాంప్లెక్స్ నుంచి బయటకు వచ్చేందుకు నానా అవస్థలు పడ్డారు. శనివారం ఉదయం కూడా వరదనీరు నిలిచి ఉండడంతో ప్రయాణికులు కాంప్లెక్స్ లోపలికి వెళ్లి బస్సు ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అసలే సౌకర్యాలు లేక అంతంతమాత్రంగా ఉన్న కాంప్లెక్స్‌లో ఒక రోజు సాయంత్రం కురిసిన భారీ వర్షానికి కాంప్లెక్స్ ప్రాంతం ఇలా ఉంటే రానున్న రోజుల్లో తుఫాన్లు, భారీ వర్షాలు పడితే పరిస్థితి ఏ విధంగా ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదని ప్రయాణికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ అధికారులు వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణికులతో పాటు, స్థానికులు కోరుతున్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జాతీయ లోక్ అదాలత్‌ను సెప్టెంబరు 9న నిర్వహించనున్నట్లు రెండో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సెల్ కమిటీ చైర్మన్ ఎస్.దామోదరరావు తెలిపారు. రాజీ మార్గం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు భవనంలో పోలీస్, బ్యాంక్ అధికారులు, న్యాయవాదులు, సంబంధిత శాఖల అధికారులతో జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. లిటిగేషన్ కేసులు తక్కువగా ఉన్న చోట ప్రజల జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉంటాయన్నారు. పోలీస్ స్టేషన్లు, శాఖల వారీగా కేసులను గుర్తించి సామరస్యంగా పరిష్కరించినట్లయితే ప్రశాంతంగా జీవించే అవకాశం కల్పించిన వారవుతారన్నారు. ఎక్కువ పెండింగ్ కేసులున్న చోట అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కక్షిదారులు లోక్‌అదాలత్ ముందుకొచ్చి రాజీపడి కేసులను పరిష్కరించుకోవాలన్నారు. సాంకేతికత పెరుగుతున్నా కేసుల సంఖ్య, భారం ఎక్కువవుతుందని, చిన్న చిన్న తగాదాలు కూడా కోర్టులకు వస్తున్నాయన్నారు. నీతిగా, నిజాయితీగా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలని, ప్రతికూల పరిస్థితులు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొని నిలబడాలని, మంచి భావన కక్షిదారుల్లో కలిగించాలని సూచించారు. ప్రజల పన్నుల ద్వారా జీతాలు వస్తున్నాయని, ప్రత్యక్ష, పరోక్ష పన్నులు మనం కడుతున్నామని, పేదవారు పరోక్ష పన్నులు కడుతున్నారన్నారు. సమాజానికి మంచి సేవలు అందించాలని చెప్పారు. లోక్ అదాలత్ ఆవశ్యకతను సోషల్ వర్కర్లు వివరించాలని సూచించారు. రైతులు కష్టపడి పంట పండిస్తేనే ఆహారం లభిస్తుందని, వారిపట్ల ఉదారత చూపించి విరివిగా రుణాలు అందజేయాలన్నారు. లిటిగేషన్ కేసులు తక్కువగా ఉండడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కక్షిదారులలో కక్ష, కసి అనేవి కొద్ది రోజులు మాత్రమే ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. పోలీస్ అధికారులను, బ్యాంకు అధికారులను పెండింగ్ కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, అడిషనల్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ డి.సౌజన్య, బార్ అసోషియేషన్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాసరావు, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ ఎం.రవిశంకర్ ప్రసాద్, ఎల్‌డిఎం జె.ఎల్.ఎన్. మూర్తి, పోలీస్ అధికారులు, ఎస్ఐలు ఎస్. షణ్ముఖరావు, ఎం.జగదీష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న లీగల్ సెల్ కమిటీ చైర్మన్ దామోదరరావు

సవాళ్ల వెనుక పదవీ యావ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'ఏ మాటల వెనుక ఏ వర్గ ప్రయోజనం దాగి ఉందో తెలుసుకోలేనంత కాలం ప్రజలు మోసపోతూనే ఉంటారు' అని అన్నాడు లెనిన్ మహాశయుడు. చీపురుపల్లి నియోజకవర్గంలో ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ విన్యాసాలను పరిశీలిస్తున్న వారిలో చాలామంది అచ్చంగా లెనిన్ ఆలోచనా స్ఫూర్తిని గుర్తుచేస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. చీపురుపల్లి నియోజకవర్గంలో ఇటీవల వైసిపి, టిడిపి మధ్య పరస్పర విమర్శలు చోటు చేసుకుంటున్న విషయం విదితమే. అంతటితో ఆగకుండా వారి వాదన, ప్రతివాదనలను ప్రజల సమస్య మాదిరిగా చిత్రీకరిస్తూ సవాళు,, ప్రతి సవాళ్లకు దిగుతూ రోడ్లపైకి రావడం ఆసక్తికరంగా మారింది. ఉగాది తర్వాత టిడిపి, జనసేన ఉండబోవంటూ మంత్రి బొత్స సత్యనారాయణ శ్రీకాకుళంలో చేసిన వ్యాఖ్యలపై టిడిపి చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున స్పందించిన సంగతి తెలిసిందే. బొత్స వ్యాఖ్యలపై రాతపూర్వకంగా అగ్రిమెంటు ఇవ్వగలరా? అంటూ నాగార్జునతోపాటు చీపురుపల్లికి చెందిన టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. చీపురుపల్లి ఆర్‌ఇసిఎస్ పరిధిలోని ఎనర్జీ అసిస్టెంట్ పోస్టుల నియామకాల్లో అక్రమాలు జరిగాయని, నకిలీ సర్టిఫికెట్లతో కొంతమంది అనుయాయులకు ఉద్యోగాలు ఇప్పించారని కూడా విమర్శించారు. వీటన్నింటినీ తాము నిరూపిస్తామని, ఇరుపక్షాల ఆరోపణలు, వాదనలపై బాండ్ పేపర్ల మీద రాసుకుందామని కూడా సవాలు విసిరారు. తాము నిరూపించిన మరుక్షణం వైసిపి నాయకులు గుండు గీసుకుని రాజకీయ సన్యాసం చేస్తారా? అని సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం చీపురుపల్లి ప్రజల ఇలవేల్పు కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ఇరుపక్షాలకు చెందిన నేతలు చర్చకు సిద్ధమయ్యారు. దీంతో, పోలీసులు ఇరుపార్టీలకు చెందిన నాయకులనూ, ముఖ్యంగా టిడిపి నాయకులను గృహ నిర్బంధం చేసిన సంగతి తెలిసిందే. ఇదంతా వైసిపి, టిడిపి ఆడుతున్న రాజకీయ డ్రామాలేనని చాలామంది వాదన. ప్రజల సమస్యలు వదిలేసి, ఇలా ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడం వల్ల

ఉపయోగమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆర్‌ఇసిఎస్‌లో జరిగిన అక్రమాలపై బాండ్ పేపర్లపై సంతకాలకు డిమాండ్ చేసే బదులు, చిత్తశుద్ధి ఉంటే వెంటనే బయటపెట్టాలి కదా? అంటూ జనం చర్చించుకుంటున్నారు. వైసిపికి చెందిన బొత్స అనుయాయులు కూడా పుచ్చకాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్టుగా స్పందించే బదులు, వైసిపి హయాంలో చేసిన ఘనకార్యమేమిటో చెప్పొచ్చు కదా? అని కూడా జనం చర్చించుకుంటున్నారు. వాస్తవానికి నియోజకవర్గంలో సీనియర్ నాయకులు, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని ఆశించినప్పటికీ ఆచరణలో కనిపించలేదని చాలా మంది వాపోతున్నారు. పైగా ఈ ప్రాంతంలో ఉన్న ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడ్డాయి. విద్యుత్తు రాయితీలు ఇవ్వకపోతే నష్టమని పరిశ్రమల యజమాలు చేసిన మొర మంత్రి గారికి వినిపించలేదు. పైగా లాభాలు వచ్చినప్పుడు ఎవరికైనా ఇచ్చారా? అంటూ వారిని ఎగతాళి చేశారు. తొందర పడి పరిశ్రమలు మూసేయవద్దంటూ ఉచిత సలహాలు ఇచ్చారు. దీంతో, ఐదు యూనిట్లతో నడిచే గరివిడి ఫేకర్‌లో ఒక యూనిట్ పని నిలిపివేశారు. దీంతో పరిశ్రమలో పనిగంటలు తగ్గాయి. కార్మికులకు పూర్తిస్థాయిలో పనిలేదు. గరివిడి, మెరకముడిదాం, చీపురుపల్లి మండలాల్లోని ఫెర్రో పరిశ్రమలు మూతపడటంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. దీనిపై ఎలాగూ మంత్రి దృష్టిపెట్టలేదు. కనీసం టిడిపి అయినా ప్రశ్నించి ఉంటే బాగుండేదనిది జనం మాట. ఆర్‌ఇసిఎస్‌లో అవినీతి భాగోతం బయటపెట్టడానికి బాండ్ పేపర్లు వెతుక్కునే బదులు, వెంటనే బయట పెట్టడంతోపాటు అందులో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై మాట్లాడటం లేదు. ఇలా అనేక సమస్యలు నియోజకవర్గాన్ని వెంటాడుతున్నాయి. తోటపల్లి నీరు పూర్తిస్థాయిలో రావడం లేదు. వీటన్నింటిపైనా స్పందించని అధికార, ప్రతిపక్షాలు ఎన్నికలు దగ్గర పడుతుండడంతో మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు ఇటువంటి సవాళ్లతో హడావుడి చేస్తున్నాయని జనం చర్చించుకుంటున్నారు.

రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

నెరవేరిన కిచ్చాడ ప్రజల కల

ప్రజాశక్తి - కురుపాం

రహదారి సౌకర్యం లేక ఎన్నో ఏళ్లగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కిచ్చాడ గ్రామస్తుల దశాబ్దాలు కల నెరవేరిందని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. మండలంలోని కిచ్చాడ పంచాయతీ జోగిరాజు పేట నుండి వెంకటాపురం వరకు రూ.కోటీ 42లక్షలతో 2 కిలోమీటర్ల 800 మీటర్ల బిటి రహదారి పూర్తయిన నేపథ్యంలో వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎన్నో ప్రభుత్వాలు పరిపాలించాయని, కానీ కనీసం రహదారి సౌకర్యం కల్పించలేకపోయావని, దీంతో ఈ గ్రామపంచాయతీ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొండేవారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గవర రాజ్యలక్ష్మి, ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి జి.సుజాత, అయ్యరకల కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయచంద్రశేఖర్, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ కె. సురేష్ కుమార్, ఎంపిటిసి వి.బంగారనాయుడు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండ చీపుర్లును పరిశీలిస్తున్న జిసిసి ఎమ్‌డి సురేష్‌కుమార్

విడివికెలను జిసిసి ఎమ్‌డి తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన సహకార సంస్థ, వైయస్సార్ క్రాంతి పథకం, వెలుగు సమన్వయంతో నిర్వహిస్తున్న వన్ ధన్ (వందన) వికాస్ కేంద్రాలను గిరిజన సహకార సంస్థ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ గేదెల సురేష్ కుమార్ శనివారం సందర్శించారు. మండలంలోని దిబ్బగూడలో గల విడివికె కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి మహిళలు నిర్వహిస్తున్న పసుపు మార్కెటింగ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఎలా నడుపుతున్నారో పరిశీలించారు. పసుపు బ్రాండెడ్‌గా విక్రయించాలని సూచించారు. అనంతరం మండలంలో వనతలి, జక్కరగూడలో విడివికె కేంద్రాలను సందర్శించారు. కొండచీపుర్లు విక్రయాలు, మిషన్ల ద్వారా కటింగ్ నాజుగా నాణ్యత ఏ విధంగా తయారు చేస్తున్నారో పరిశీలించారు. దీనివల్ల ఏ విధంగా ఆర్థికంగా సభ్యులకు ప్రయోజనం ఉంటుందని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు ఆయన వెంట జిసిసి డివిజన్ డివిజనల్ మేనేజర్ జి.సంధ్యారాణి, ఎపిడి రమణ, సీతంపేట, పాతపట్నం బ్రాంచ్ మేనేజర్లు దాసరి కృష్ణ, జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సిలగంలో ప్రచారం చేస్తున్న జయకృష్ణ

ఏజెన్సీలో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సిలగం పంచాయతీలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ టిడిపి మ్యానిఫెస్టో వివరిస్తున్న జయకృష్ణకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. దేశ రాజకీయాల్లో ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇవ్వగల ఏకైక వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందేలా చంద్రబాబు మ్యానిఫెస్టో ప్రకటించారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, ఐటిడిపి కోఆర్డినేటర్ హిమరక పవన్, నిమ్మక చంద్రశేఖర్, తోయిక సంతు, తోయిక వెంకటేష్, తోయిక ప్రవీణ్, సవర కామేష్, సవర చిన్నారావు, సవర బాపాడు, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘ సభ్యుల అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి - కొమరాడ

సహకార సంఘంలోని సభ్యులను అభివృద్ధి చేసే దిశగా సంస్థ కృషి చేస్తుందని మూడు జిల్లాల సహకార సంఘం విద్యాధికారి ఎం.రమేష్‌బాబు అన్నారు. శనివారం స్థానిక పిఎసిఎస్ వద్ద అధ్యక్షులు ఎన్.సూరప్ప నాయుడు ఆధ్వర్యంలో సభ్యులకు సహకార సంఘం విద్యా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సూరప్పనాయుడు మాట్లాడుతూ ప్రతి సంఘం పొదుపు గ్రూపులు ఏర్పాటు చేసి స్వయం ప్రతిపత్తి సాధించాలని అన్నారు. రైతుల కోసం సంఘంలో గిడ్డంగి, వేయింగ్ బ్రిడ్జ్, తదితర సదుపాయాలను పిఎసిఎస్ వద్ద ఏర్పాటు చేశామన్నారు. రైతులంతా ఈ సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. అనంతరం రమేష్‌బాబు సభ్యుల అర్హతలు, అనర్హతలు సహకార సూత్రాలు విలువలను సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ సిఇఒ మాధవరాయుడు, సిబ్బంది రైతులు సభ్యులు పాల్గొన్నారు.

తోటపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్వతీపురానికి చెందిన ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జ్యోతి విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ బుద్ధ మహాలక్ష్మి నగేష్, సిబ్బంది మార్కొండ మురళి నాయుడు, పోలిరాజు, ఆలయ కమిటీ సభ్యులు మార్కొండ ఫకీరునాయుడు, వడ్డి మహేశ్వరరావు (మహేష్) తదితరులు పాల్గొన్నారు.

చింతాడలో మహాశక్తి యాత్ర

ప్రజాశక్తి - సీతంపేట

టిడిపి మండల పార్టీ అధ్యక్షులు సవరతోట మొఖలింగం ఆధ్వర్యంలో చింతాడ పంచాయతీ పరిధిలో మహాశక్తియాత్ర శనివారం మహాశక్తి ప్రచారకర్త తోయక సంధ్యారాణి నిర్వహించారు. గ్రామాల్లో ప్రజల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు సమస్యలు ఆమెతో చెప్పుకున్నారు. అలాగే పంచాయతీ పరిధిలో గల సమస్యలను భవిష్యత్తులో తెలుగుదేశం ప్రభుత్వం వస్తే పంచాయతీకి కావాల్సిన అన్ని సౌకర్యాలను నెరవేర్చుకోగలమని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఆరిక సువర్ణ వరలక్ష్మి, సవర సూర్యం, సవర తిక్కమ్మ, సరోజిని, అప్పలమ్మ, సుండమ్మి, సుందరి, మంగమ్మ, చంద్రమ్మ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాయగడజమ్ములో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని గొరడ పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు సూచించారు. మాతోట జీవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని మారుమూల గ్రామమైన రాయగడజమ్ములో శనివారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల పశువుల పెంపకం దారులకు సలహాలు, సూచనలు అందించారు. పశువులకు జబ్బవాపు, గొంతువాపు, ముద్ద చర్మ పొదుగువాపు వ్యాధి, కృత్రిమ గర్భధారణ, గాలికుంటు, జలగ వ్యాధులు వస్తాయని, గొర్రెలు, మేకలకు చిటుకు వ్యాధి, మూతుపుడ్లు, ముసరా వ్యాధులు వస్తాయని వివరించారు. అనంతరం టీకాలు వేశారు. సర్పంచి పత్తిక అమల చేతుల మీదుగా రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవ కోఆర్డినేటర్ జి.ప్రొబోధ్, జి.మురళీమోహన్, మాతోట కమిటీ కార్యదర్శి కె.చిరంజీవులు, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదే : ఎంపిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపిపి కె.దీనమయ్య అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా చూడాలని అన్నారు. నాడు నేడులో ప్రభుత్వం అంగన్వాడి, పాఠశాల భవనాలకు ప్రాధాన్యత ఇచ్చిందని, ఈ మేరకు జరుగుతున్నాయని అన్నారు. సర్వసభ్య సమావేశాలకు ప్రజా ప్రతినిధులు ముందుగా వచ్చి వేచి చూస్తున్న అధికారులు మాత్రం సకాలంలో రావడంలేదని అన్నారు. చెముడుగూడ ఎంపిటిసి మండంగి రమణ సభ వేదిక దృష్టికి తీసుకువచ్చారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా కొంతమంది మాత్రమే వస్తున్నారన్నారు. జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని, క్రిమిసంహారక మందులు సరఫరా చేయాలని, పొటాష్ రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, వ్యవసాయ, ఇంజనీరింగ్ తదితర శాఖలపై సమీక్ష జరిగింది. సవర కోటపాడు ఉద్యానవన కేంద్రంలో రూ.2కోట్లతో పర్యాటక ప్రాంత అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని భద్రగిరి ఐటిడిఎ ఎఇఇ అప్పారావు తెలిపారు. ఇప్పటి వరకు 50 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. పూర్తిస్థాయిలో పనులు పూర్తయితే ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుందన్నారు. నాడు-నేడులో రూ.1కోటి 24 లక్షలతో అభివృద్ధి కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. మొరమ, చదునుగూడ గ్రామాల్లో అంగన్వాడీ భవనాలు మంజూరు చేయాలని లక్కగూడ సర్పంచి బిడ్డిక సూర్యారావు కోరారు. రెల్లలో ఉన్న అంగన్వాడి కేంద్ర భవనం పూర్తిగా శిథిలమైందని, కొత్తది మంజూరు చేయాలని సర్పంచ్ కోరారు. సమావేశంలో జడ్పిటిసి మండంగి రాధిక, వైస్ ఎంపిపిలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, బిసి రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దీనమయ్య

విశాఖ -గుణుపూర్ రాత్రి బస్సు సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఒడిశా ప్రాంత ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. ఈనెల 19 శనివారం నుంచి విశాఖపట్నం నుండి గుణుపూర్ వరకు రాత్రి బస్సు సర్వీస్ ప్రారంభమవుతున్నాయి. ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ప్రతిరోజు మధ్యాహ్నం విశాఖలో 4 గంటలకు బయలుదేరి విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, కురుపాం, గుమ్మలక్ష్మీ పురం మీదుగా గుణుపూర్ రాత్రి 10 గంటలకు చేరుతుంది. మరుసటి రోజు ఉదయం గుణుపూర్‌లో 6.30కు బయలుదేరి గుమ్మలక్ష్మీపురం, కురుపాం, పార్వతీపురం మీదుగా విశాఖ చేరుతుందని విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు, డిపో మేనేజర్ కె.గంగాధర్ తెలిపారు. ఈ ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -భామిని

మండలంలోని 33 కెవి, ఎబి స్విచ్ ఏర్పాటు, భామిని, గురండి విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతులు నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుందని, పాలకొండ విద్యుత్ ఇఇ గోపాలకృష్ణ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్లకు ఇళ్లస్థలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అర్హత గల ఫోటో, వీడియోగ్రాఫర్లందరికీ ప్రభుత్వ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు హామీ ఇచ్చారు. ప్రపంచ ఛాయచిత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ఎపి ఎన్‌జిఒ భవనంలో జిల్లా పరిధిలో ఉన్న ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం సభ్యులంతా కలిసి ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జోగారావు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంఘ సభ్యులు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ మీకు ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తామని, అలాగే ఇతర సంక్షేమ పథకాలు, వ్యక్తిగత రుణాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు తోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా గల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కురుపాంలో గల ఫోటోగ్రాఫర్లు ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. అనంతరం స్థానిక సిహెచ్‌సిలోని రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు మద్ది సుధాకరరావు, రామారావు, మన్మథరావు, జి.శివ, ప్రసాద్, వైద్యాధికారి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' వృద్ధులకు వరం : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి -కొమరాడ

కంటి వెలుగు కార్యక్రమం వృద్ధులకు వరమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. మండలంలోని విక్రమపురంలో శనివారం నిర్వహించిన వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. 60ఏళ్లు పైబడిన వృద్ధులు నేత్ర పరీక్షలు చేయించుకోని వారికి ఈ వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు నేత్ర పరీక్షలు చేసినట్లు జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేత్ర పరీక్షలు నిర్వహించి ఆరుగురికి కళ్లజోళ్లు, ఐదుగురికి కేటరాక్ట్ శస్త్ర చికిత్స కోసం గుర్తించి, వారిని రిఫరల్ చేసినట్లు తెలిపారు. ఈ నేత్ర పరీక్షల్లో కళ్ల జోళ్లు అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు, శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కోసం పంపిస్తున్నట్లు తెలిపారు. చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించినట్లు నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి తెలిపారు. గతంలో నేత్ర పరీక్షలు నిర్వహించి కళ్ల జోళ్లు అవసరం అని గుర్తించిన వారికి డిఎంహెచ్‌ఒ చేతుల మీదుగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్ బాబు కంటి వెలుగు కార్యక్రమంలో అవ్వా తాత కంటి చూపు కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం అధికారి చామంతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజల వద్దకు వైద్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలు వద్దకే వైద్య సేవలు అందుతున్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథ రావు అన్నారు. శనివారం శివుని గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. కొమరాడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని జగన్నాథరావు పరిశీలించి ప్రజలకు అందుతున్న వైద్యశాలపై ఆరా తీశారు. అనంతరం అవసరమైన ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయలని సూచించారు. రోగాల బారిన పడకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శించాలని, ప్రజలకు పలు సూచనలు సలహాలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సాహితీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వంటగ్యాస్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

వంటగ్యాస్ వినియోగదారులు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వీలుగా ప్రతి ఐదేళ్లకొకసారి సురక్ష రబ్బర్ ట్యూబును విధిగా మార్చుకోవాలని పార్వతీపురం పెంటపాటి కామరాజు హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ డీలర్ పెంటపాటి సూర్యరావు, పెంటపాటి సాయికిరణ్ తెలిపారు. శనివారం గరుగుబిల్లిలో ఉచిత గ్యాస్ స్టవ్ సర్వీసింగ్ శిబిరాన్ని గ్యాస్ ఏజెన్సీ డీలర్లు, గరుగుబిల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెంటపాటి సాయికిరణ్ మాట్లాడుతూ నగదు రహిత లావాదేవీల చెల్లింపులపై వినియోగదారులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే ఈ మేళాలో వినియోగదారులకు గ్యాస్ బుకింగ్ ఎలా చేసుకోవాలో తెలియజేయడం జరుగుతుందన్నారు. గ్యాస్ వినియోగదారులు గ్యాస్ ఎప్పుడు అయిపోయినా నిరంతరాయంగా ఇంట్లో వంట ఆగకుండా ఉండేందుకు వీలుగా రెండో సిలిండర్‌ను మంజూరు చేస్తున్నామన్నారు. ఇంతవరకు గ్యాస్ కనెక్షన్‌లేని వారికి తక్షణమే గ్యాస్ కనెక్షన్‌ను మంజూరు చేస్తామన్నారు. స్థానిక సర్పంచ్ ఇందుమతి మాట్లాడుతూ గ్యాస్ వినియోగదారులు ఉచిత సర్వీసింగ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు గ్యాస్ వినియోగదారులు పాల్గొన్నారు.

భామిని : స్థానిక శ్రీమన్నారాయణ హెచ్‌పి గ్యాస్ గ్రామీణ వితరక్ డిస్ట్రిబ్యూటర్ కోరాడ రాజేష్ ఆధ్వర్యంలో కీసరలో గ్యాస్ ఏజెన్సీ ద్వారా అందిస్తున్న సేవలు, గ్యాస్ వినియోగం, ఏజెన్సీ ద్వారా ఆఫర్ రూపంలో అందిస్తున్న గ్యాస్ స్టవ్లు, ఇతర సేవలను వివరించారు. అలాగే గ్యాస్ వినియోగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వినియోగదారులకు శనివారం అవగాహన కలిగించారు. కార్యక్రమంలో గ్యాస్ డెలివరీ బాయ్స్ పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులను తప్పనిసరిగా నమోదు చేయాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గర్భిణీ, బాలింతలు, శిశు ఆరోగ్యం కోసం కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం సందర్శించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గర్భిణీలను గుర్తించి నమోదు త్వరితగతన పూర్తి చేసి అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించాలన్నారు. వైద్య పరీక్షల, ఆరోగ్య తనిఖీల్లో అసాధారణంగా ఫలితాలు ఉన్న గర్భిణులను హైరిస్క్‌గా గుర్తించి ప్రసవం పూర్తైన కొన్ని రోజుల వరకూ పూర్తి స్థాయిలో పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా ఆ గ్రామ పరిధిలో ఉండే గర్భిణీలు, బాలింతలకు అవసరమైన అన్ని ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సంబంధిత ఎఫ్‌డిపి యాప్‌లో వివరాలు వెంటనే నమోదు చేయాలన్నారు. సచివాలయాల వారీగా ఎఫ్‌డిపి యాప్‌లో నమోదు చేసిన గర్భిణీ, బాలింతల ఆరోగ్య వివరాలను ఆయన పరిశీలించి, పెండింగ్ ఉన్న వాటిని పూర్తి చేయాలన్నారు. నవజాత శిశువుల గృహ సందర్శనలు చేసి ఆరోగ్య వివరాలు ఇ- ఆశా యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఏవైనా ప్రమాదకర సూచికలు గుర్తిస్తే వెంటనే తగు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ల్యాబ్, వ్యాక్సిన్ నిల్వలు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అరుణ కుమారి, సూపర్ వైజర్స్ ప్రకాష్, జయగౌడ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కమిషనర్ రామప్పలనాయుడు

పోటీ పరీక్షల్లో విజయం సాధించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమయ్యే కొత్త పుస్తకాలను ప్రతి రోజు చదివి, ఆ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు విజయం సాధించాలని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు యువతతో అన్నారు. శనివారం పట్టణంలోని బెలగాంలో ఉన్న చర్చివీధిలో గల మున్సిపల్ గ్రంథాలయానికి కమిషనర్ పోటీ పరీక్షలకు అవసరమయ్యే ప్రత్యేక పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్రూప్ 1, గ్రూప్ 2, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారికోసం ప్రత్యేకంగా మున్సిపాలిటీ నిధులతో గ్రంథాలయంలో ఉంచుతామన్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎల్విన్‌పేట పంచాయితీ పరిధిలోని జెకె పాడులో మాజీ జెడ్పిటిసి అలజంగి భాస్కరరావు పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో జమున మోడల్‌లో రాగి పంట సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం కోఆర్డినేటర్ భూషణరావు మాట్లాడుతూ రాగి పంట సాగు విధానంలో అదనపు ఆదాయం కోసం మోడల్ చుట్టూ తీగ జాతి బీరా, ఆనప, కాకర, చిక్కుడు, కంది, బెండ, వంగ, బంతి, ఆకుకూరలు వేయడం జరిగిందన్నారు. వరి పంట సాగు తగ్గించుకొని చిరుధాన్యాలు ఎక్కువ స్థాయిలో వేసుకోవాలని మంచి దిగుబడి, మంచి ధర పలుకుతూ పలుకుతుందన్నారు. ఈ చిరుధాన్యాలతో ప్రతి ఒక్కరికి మంచి ఆరోగ్యం వస్తుందన్నారు. రాబోయే కాలానికి ఈ చిరుధాన్యాలే ప్రజలకు ఆహారంగా మారుతుందన్నారు. వీటి వల్ల ఎటువంటి బిపి, సుగరు, కేన్సర్ తదితర రోగాలు రాకుండా కాపాడుతుందన్నారు. సామలు, గంటేలు, చోడీ, ఊదలు, కొర్రలు, జొన్నలు వంటి పంటలపై రైతుల దృష్టి సారించాలని అన్నారు. ఇటువంటి పంటలపై భూమికి సారం కూడా పెరుగుతుందని, ఎటువంటి రసాయినిక ఎరువులు వాడకుండా గిరిజన ప్రాంతాల్లో మంచి ఆహార ఉత్పత్తుల పండించి మార్కెటింగ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు సిసిలు గోపాలరావు, సుందరరావు, లక్ష్మణరావు, రైతు మిత్ర సంఘం అధ్యక్షులు ఆరిక అగ్గన్న, ఐసి ఆర్‌పి దీప పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ బ్యాంకు ఖాతా

ప్రజాశక్తి - భామిని

ప్రతి విద్యార్థికి బ్యాంక్ ఖాతా ఉండడం వల్ల పొదుపు అలవాటుగా మారి అవసరం మేరకు డబ్బులు వినియోగించే క్రమశిక్షణ అలవడుతుందని ఎపిజివి అనుబంధం జిటిఐడిఎస్ ఏరియా మేనేజర్ తామరసెల్లి సురేష్ తెలిపారు. స్థానిక ఎపి ఆదర్శ పాఠశాలలో పిఎంజెడివై భాగంగా జీరో బాలన్స్ ఎపిజివిబి ఖాతాలు విద్యార్థులు తెరుచుకోవాలని, బ్యాంకు ఖాతాలు పాఠశాలలోనే బ్యాంకు మిత్రల సహాయంతో తెరవబడునని తెలిపారు. ఈ ఖాతాలు తెరవడానికి ప్రతి విద్యార్థి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, 2 పాస్ ఫొటోస్, సోమవారం తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు బ్యాంక్ ఖాతాలకై బ్యాంకుకు వెళ్లకుండా, మీ పాఠశాలలోనే ఖాతాలు తెరవబడునని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్, బ్యాంకు మిత్రలు ఎన్.త్రినాథ్, ఎం.రవి ఉన్నారు.

ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినబోగిలికి చెందిన బిఎస్ఎఫ్ జవాన్ నగర ప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, సీతానగరం నాయకులు శంకర్రావు మాస్టర్, పకీర్ నాయుడు, యోగేశ్వరరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు వెంకయ్య, వెలంగిణి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

పర్యావరణం పరిరక్షణకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని మండలంలోని చిలకాం మండల పరిషత్తు ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంచుమోజు రామ్మోహన రావు అన్నారు. ఈ మేరకు పాఠశాలలో శనివారం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మోహనరావు మాట్లాడుతూ పాఠశాలలో మొక్కలు నాటడం వల్ల ఇటు పర్యావరణంతో పాటు అటు పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో పాటు పచ్చదనానికి నిలయంగా ఉంటుందని పేర్కొన్నారు. నాటిన మొక్కలను పరిరక్షించేందుకు చుట్టూ కంచెను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు మద్రాపు మహేష్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అధిక సంఖ్యలో మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడకెళ్లలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని కడకళ్లలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నయమి, ఏఎన్ఎం బి శకుంతల ,ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వెలగవలసలో ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

మండలంలోని వెలగవలసలో 58 మందికి వైద్య పరీక్షలు అందించినట్లు వైద్యాధికారి ఐశ్వర్య శనివారం తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో గ్రామంలో ప్రతినెలా క్రమం తప్పకుండా రెండుసార్లు వైద్య పరీక్షలు అందిస్తున్నామని ఆమె అన్నారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్నాయని వారందరికీ ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రక్త పరీక్షలు నిర్వహించి మలేరియా ఉన్నవారికి మలేరియా కోర్సును అందించామన్నారు.

మహారాజశ్రీ పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు
S.O.P.3/2023

Between :
Tamarakandi sundaramma .....Plaintiff.
And
1. The State Rep. By its District Collector, Parvatipuram Manyam Dist.
2. The Tahsildar, Parvatipuram Mandalam,
3. The Village Revenue Officer, Krishnapalli village, Parvatipuram Mandalam.
4. The Executive Divisional Engineer, Easter Power Distribution Co., AP Ltd., (Operations) Division, Bobbili, Vizianagaram Dist.

ఈ పత్రిక ప్రకటన మహారాజశ్రీ పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు, వారి ఆదేశానుసారం ఇవ్వడమైనది. ఇందలి వాది గారు అయిన శ్రీమతి తామరకండి సుందరమ్మ గారు పై దావాలో లేట్ శ్రీ తామరకండి ప్రకాశ్‌రావు గారికి పెళ్లి భార్యనని, కావున తనను తామరకండి ప్రకాశ్‌రావు గారికి వారసురాలిగా గుర్తించి వారసత్వ ధృవీకరణ పత్రము (Succession Certificate) ఇప్పించవలసినదిగా కోరుతూ పై దావాను వేసి యున్నారు.

కావున ఈ పత్రిక ప్రకటన మూలకముగా యావన్మంది ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా పై విషయమై ఎవరికైన అభ్యంతరములు ఉంటే తదుపరి వాయిదా **తేదీ 31-08-2023 నాడు ఉదయం 10-30 గంటలకు** పై కోర్టుకు మీరుగాని మీ తరుపు న్యాయవాది గాని హాజరై మీ అభ్యంతరములు తెలియపరచవలసినదిగా కోరడమైనది.

పార్వతీపురం
తేది: 20/08/2023

Sri A.T.R.Patnaik, B.Com., B.L.,
Sri G.Raja Kumar, B.Sc., B.L.,
Advocates, Parvatipuram.

రహదారులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

గిరిజన గ్రామాల రహదారులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందని ఎమ్మెల్యే ఎ.జోగారావు అన్నారు. శనివారం బొడ్డవలసలో సిసి రోడ్డు, డోకిశీలలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యానికి ఎవరూ దూరం కాకుండా ఉండేందుకే రహదారుల నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. గిరిజన గ్రామాలకు సైతం మంచినీరు అందించే ఉద్దేశంతో ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.

ప్లాస్టిక్ ఆట బొమ్మల మాటున నాటుసారా రవాణా

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్లాస్టిక్ ఆట బొమ్మల చాటున నాటు సారా రవాణా చేస్తున్న వ్యక్తిని శనివారం అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ ఎల్.ఉపేంద్ర తెలిపారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఒడిషా నుండి ఆంధ్రాకు నాటు సారా రవాణా జరుగుతుందన్న సమాచారంతో పార్వతీపురం మండలం గోచెక్క సమీపంలో వాహన తనిఖీలు చేపట్టగా అనుమానంతో ఒడిషా రాష్ట్రం కస్పవలస వైపు నుండి వస్తున్న వెదురుబుట్టలో ప్లాస్టిక్ ఆట బొమ్మలతో వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేశామన్నారు. వెదురు బుట్ట(గరిశ)లో ఆట బొమ్మల మాటున ప్లాస్టిక్ క్యాన్లతో నాటు సారాను గమనించి వాహనాన్ని సీజ్ చేసి 120లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం పట్టుబడిన ఒడిషాలోని విక్రంపూర్‌కు చెందిన పువ్వల దిలీప్‌ను విచారించగా, నాటు సారాను సాలూరు పట్టణానికి చెందిన గొర్లి పవన్‌కు సరఫరా చేస్తున్నట్లు తెలపడంతో ఆ వ్యక్తులపై కేసు నమోదు చేసి, సారా రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఎస్ఐ రమణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

మన్యం సహజ ఉత్పత్తి దారుల కంపెనీకి అవార్డు

ప్రజాశక్తి - సీతంపేట

మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీకి అవార్డు లభించింది. ఎపి ఏరువాక ఫౌండేషన్ కిసాన్ మహోత్సవంలో భాగంగా 2023 గుంటూరులోని కెఎల్ యూనివర్సిటీలో శనివారం (రాష్ట్ర స్థాయి ఉత్తమ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ అవార్డును) మార్కెటింగ్, సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, ఇంటర్నేషనల్ లిమిటెడ్ కోరమండల్ వైస్ చైర్మన్ జివి సుబ్బారెడ్డి చేతుల మీదుగా మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ సిఇఒ బి.శంకర రావును శాలువతో సత్కరించి అవార్డును ప్రధానం చేశారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ ఈ అవార్డు రావడానికి సహకరించిన ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, నాబార్డ్ డిడిఎంలు కుప్పిలి వరప్రసాద్, నాగార్జున వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, డిసిసిబి బ్యాంకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అవార్డును అందుకుంటున్న శంకరరావు